# ఘనంగా విజయ దశమి వేడుకలు

## ఊరూరా జమ్మి చెట్టు వద్ద పూజలు

పాలకుర్తి, అక్టోబర్ 24 : విజయ దశమి పర్వదినం సందర్భంగా మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రజలు దసరా సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం పాలకుర్తిలో సర్పంచ్ వీరమనేని యాకాంతరావు ఆధ్వర్యంలో బొడ్రాయి వద్ద తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి డప్పు చప్పుల్లతో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ర్యాలీగా ఓంకారేశ్వర ఆలయం వరకు తరలివచ్చారు. అనంతరం జమ్మి చెట్టు వద్ద పూజారి గంగు రఘుశర్మ పూజలు నిర్వహించారు. సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పార్వతీ అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ కాలనీల్లో దుర్గాదేవి వేడుకలను నిర్వహించారు. దసరా సందర్భంగా పాల పిట్టను దర్శించుకున్నారు. మరోవైపు పలు గ్రామాల్లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**కొడకండ్లలో..**

కొడకండ్ల : మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో విజయ దశమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా విజయదశమి వేడుకలు జరిగాయని ఎస్సై తెలిపారు. అవాంచనీయ సంఘటనలు జరుగలేదన్నారు.

**దేవరుప్పులలో..**

దేవరుప్పుల : మండలంలో విజయదశమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఇంటింటికీ బంధువులు తరలిరాగా ఉదయమే తలంటి స్నానాలు చేసి కొత్తబట్టలు ధరించి దుర్గామాతకు పూజలు చేశారు. సాయంత్రం ఇంటల్లిపాది వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి పాలపిట్ట, కర్రెపిట్ట, గరత్మంతుని దర్శనం చేసుకున్నారు. అనంతరం జమ్మి చెట్టు కింద ఆయుధపూజ, జమ్మి పూజ చేశారు. వివిధ కుల వృత్తుల పెద్దలు హాజరుకాగా ఆనవాయితీగా ఆనపకాయను బలి ఇచ్చారు. రాత్రి వేళ పిల్లలు పటాకులు కాల్చి విందు భోజనాలతో ఆనందంగా గడిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రవణ్‌కుమార్ నేతృత్వంలో పురోహితుడు ఉప్పల రమేశ్ శర్మతో ఆయుధ పూజ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సదానందం, కానిస్టేబుళ్లు అశోక్, యాకేశ్, రామకృష్ణ, యాకూబ్ పాల్గొన్నారు.


పాలకుర్తిలో బొడ్రాయి పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్


గూడూరులో విజయ వేడుకల్లో స్థానికులు


సీతారాంపురంలో ఆయుధ పూజకు వెళ్తున్న గ్రామస్తులు


కడవెండిలో జమ్మిపూజలు చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ


పాలకుర్తి ఓంకారేశ్వరాలయంలో పూజలు


దుర్గామాతకు పూజలు చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## బీఆర్‌ఎస్‌కే ప్రజల ఆదరణ : ఎర్రబెల్లి

పాలకుర్తి, అక్టోబర్ 24: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని ఎంతగానో ఆదరిస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని గూడూరులో దుర్గామాత విగ్రహం వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


చండీహోమంలో పాల్గొన్న భక్తులు

## ఘనంగా చండీహోమం

కాశీబుగ్గ, అక్టోబర్ 24: కాశీబుగ్గలోని ప్రసిద్ధిగాంచిన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా చండీహోమం నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓరుగంటి కొమురయ్య, బొమ్మగాని కృష్ణమూర్తి, కుసుమ దయాసాగర్, కుంటపెల్లి ఉమాశంకర్, బండారి భాస్కర్, సారంగపాణి, ముడుతనపెల్లి సతీశ్, మామిడి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## సాయిబాబాకు సహస్ర దీపాలంకరణ

పోచమ్మమైదాన్, అక్టోబర్ 24: వరంగల్ దేశాయిపేటలోని శ్రీసాయిబాబా ఆలయంలో విజయదశమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో కొలువైన అష్టలక్ష్మి, ఆంజనేయస్వామితోపాటు శ్రీరాజరాజేశ్వరస్వామినికి భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా రాత్రి ఏర్పాటు చేసిన సహస్ర దీపాలంకరణలో దీపాలు వెలిగించారు. భక్తులు పూజలు చేశారు.


సాయిబాబా సన్నిధిలో దీపాలు వెలిగించిన భక్తులు

## శంకరమఠంలో వైభవంగా అమ్మవారి పల్లకీ సేవ

పోచమ్మమైదాన్, అక్టోబర్ 24 : వరంగల్ శ్రీనివాస కాలనీలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో ఈ నెల 14 నుంచి ప్రారంభమైన శ్రీ శారదా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా రాత్రి అమ్మవారిని పల్లకీపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహిళల కోలాట బృందం ఆటపాట అందరినీ ఆకట్టుకుంది. పల్లకీసేవ అనంతరం శ్రీ శారదా అమ్మవారికి మహా మంగళహారతి ఇచ్చారు. ముఖ్యంగా విజయదశమి సందర్భంగా ఉదయం చండీ హోమం, సాయంత్రం శమీ పూజ, అమ్మవారి పల్లకీ సేవ కనుల పండుగగా జరిగింది. జమ్మి పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సంగమేశ్వర జోషి తెలిపారు.


చెన్నారావుపేట: దుర్గామాత శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు, భక్తులు


నెక్కొండ: దుర్గామాత శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

## కనులపండువగా శోభాయాత్ర


పోచమ్మమైదాన్: ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

పోచమ్మమైదాన్/గిర్మాజీపేట/చెన్నారావుపేట/కాశీబుగ్గ/నెక్కొండ/కరీమాబాద్, అక్టోబర్ 24: వరంగల్ తూర్పు, నర్సంపేట నియోజకవర్గాల్లో తొమ్మిది రోజులపాటు కనులపండువగా నిర్వహించిన దేవీ శరన్నవ రాత్రోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. కొత్తవాడలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి ఉద్వాసన పూజ, శమీపూజ నిర్వహించి, భక్తులకు ప్రసాదం, శమీ పత్రి పంపిణీ చేశారు. వరంగల్ పిన్నవారివీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహ నిమజ్జన ఊరేగింపులో 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన పాల్గొన్నారు. చెన్నారావుపేటలోని సిద్ధేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహానికి నిమజ్జనోత్సవం నిర్వహించారు. 19వ డివిజన్ నర్సంపేటరోడ్డులోని కనకదుర్గామాత ఆలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. నెక్కొండలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవి శోభాయాత్రను కనులపండువగా నిర్వహించారు. మహంకాళి, మహాలక్ష్మి, సరస్వతీదేవి, దుర్గాంబిక తదితర రూపాల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవారిని కొలిచిన భక్తులు దసరా రోజు రాజరాజేశ్వరిగా పూజలందించి ఉత్సవాలను ముగించారు. మహిళలు మంగళహారతులు, కోలాటాలతో నెక్కొండ పురవీధుల్లో ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని ఉర్సు శివాంజనేయ దేవస్థానంలో హిందూ ఉత్సవ సమితి, దుర్గా యూనిట్ ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం నిర్వహించారు.


కరీమాబాద్: ఉర్సు శివాంజనేయ దేవస్థానంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు